# వైద్య నిపుణుల అభిప్రాయాన్ని కోర్టులు మార్చజాలవు: సుప్రీం



న్యూఢిల్లీ: ఒక వ్యక్తికొచ్చిన వ్యాధికి సంబంధించి వైద్య నిపుణుల(మెడికల్ బోర్డు) అభిప్రాయాన్ని కోర్టులు మార్చజాలవని సుప్రీం కోర్టు పేర్కొంది. వ్యాధి పరంగా వైద్యనిపుణుల అభిప్రాయమే తుది నిర్ణయమని, దానికి విలువ నిచ్చి తీరాలని, దానిని కాదనే అధికారం కోర్టులకు ఉండదని జస్టిస్ దల్వీర్ భండారీ, జస్టిస్ ముకుందకం శర్మలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. దామోదర్ అనే సైనికోద్యోగి కేసు విషయంలో సుప్రీం కోర్టు ఈ రూలింగ్ ఇచ్చింది. సైన్యంలో ఐదేళ్ళు పనిచేసిన దామోదర్ స్క్రిజోఫ్రినియా వ్యాధితో చనిపోయారు. సీనియారిటీ లేనందున నిబంధనల ప్రకారం ఆయనకు పరిహారం చెల్లించనవసరం లేదని సైనికాధికారులు చెప్పారు. దాంతో ఆయన కుటుంబీకులు కేరళ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. సైన్యంలో ఉద్యోగం చేయడం వల్లే ఆయనకావ్యాధి వచ్చింది కాబట్టి ఆయనకు రావలసిన పింఛను తదితర ఆర్థిక ప్రయోజనాలను ఆయన కుటుంబీకులకు అందజేయాలని కోర్టు తీర్పు ఇచ్చింది. అయితే, ఆయన చేసిన ఉద్యోగానికి, ఆయనకొచ్చిన వ్యాధికి ఎలాంటి సంబంధంలేదని, ఉద్యోగం వల్లే ఆయనకు స్క్రిజోఫ్రినియా వ్యాధి వచ్చిందనడం అసంబద్ధమని వైద్య నిపుణులు స్పష్టం చేశారు. కేరళ హై కోర్టు వీరి వాదనను తోసిపుచ్చింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంలో పిటిషన్ దాఖలు చేయగా, ఆ పిటిషన్‌ను సమర్థిస్తూ తీర్పునిచ్చింది.

**15-06-2011 Eenadu**